క్లుప్తంగా

ఆర్టీసీ ఆదాయాన్ని పెంచుతాం

- డీఎం రామసుబ్బయ్య



మాట్లాడుతున్న రామసుబ్బయ్య

మడకశిర: మడకశిర ఆర్టీసీ డిపో ఆదాయాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు డీఎం రామసుబ్బయ్య తెలిపారు. ఆయన శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆదాయాన్ని పెంచడంతో పాటు ఇంధన పొదుపుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలిపారు. ఇంధన పొదుపుపై డ్రైవర్లకు సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. బస్సులను సమయానికి నడిపి ప్రయాణికుల మన్ననలు పొందుతామని తెలిపారు. ప్రయాణికులు కూడా తమ ఇబ్బందులను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

7న చేపల చెరువుల వేలం

లేపాక్షి: మండలంలోని శిరివరం–మానేపల్లి గ్రామాల ఉమ్మడి చెరువుతో పాటు గోపిందేవరపల్లి చెరువుల్లో చేపలను ఈనెల 7న శిరివరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు శనివారం తెలిపారు.

శనేశ్వరస్వామి సన్నిధిలో ఏపీ మాజీ ప్రధాన కార్యదర్శి



ఎల్వీ సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న ఆలయ సమితి అధ్యక్షుడు కేవీ శ్రీనివాస్

పావగడ: తాలూకా కేంద్రంలో కొలువైన శనేశ్వర స్వామిని ఏపీ మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం శనివారం దర్శించుకున్నారు. ఎస్ఎస్కే ట్రస్ట్ అధ్యక్షుడు కేవీ శ్రీనివాస్ ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన శనేశ్వరస్వామికి పూజలు చేశారు. తైలాభిషేకం, ప్రాకారోత్సవం, నవగ్రహ పూజల్లో పాల్గొన్నారు. శీతలాంబా దేవికి కుంకుమార్చన పూజలు చేశారు. కళ్యాణ దుర్గం పురోహితుడు గోపి పాల్గొన్నారు.

జూద కేంద్రంపై పోలీసుల దాడి

చిలమత్తూరు: కోడూరు గ్రామ సమీపంలో ఓ ఫ్యాక్టరీ వెనుక నిర్వహిస్తున్న జూద కేంద్రంపై శనివారం పోలీసులు దాడి చేశారు. నలుగురు జూదరులను అదుపులోకి తీసుకొని రూ.5,830 నగదు సీజ్ చేసినట్టు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపండి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని 30వ వార్డు కౌన్సిలర్ ఆసీఫ్‌వుల్లా పిలుపునిచ్చారు. శనివారం స్థానిక హస్నాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ ఉంటాయని అన్నారు. ఆటపాటలతో చదువులు నేర్పిస్తారన్నారు. ప్రధానోపాధ్యాయులు బాలానారాయణ, జబీవుల్లా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



బాధ్యతలు చేపట్టిన లోకనాథ్‌రెడ్డి

గుడిబండ: గుడిబండ కెనరాబ్యాంకు మేనేజర్‌గా లోకనాథ్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటరెడ్డి బదిలీపై నిజామాబాద్ జిల్లాకు వెళ్లారు. దీంతో ఆ స్థానంలో అనంతపురం కెనరా బ్యాంకులో విధులు నిర్వహిస్తున్న లోకనాథ్‌రెడ్డిని నియమించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తానని నూతన మేనేజర్ తెలిపారు.

నాడు-నేడు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మీదేవి

పరిగి: బీచిగానిపల్లి, పాత్రగానిపల్లి, ఊటుకూరు గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న రెండో దశ నాడు నేడు పనులను శనివారం ఎంఈఓ లక్ష్మీదేవి పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతిపై ఆయా ప్రధానోపాధ్యాయులతో ఆరా తీశారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను అందించాలన్నారు.

'మోడల్' సీటు.. ఉన్నతికి మెట్టు

- ఆదర్శ పాఠశాల, కళాశాలల్లో కార్పొరేట్ తరహాలో విద్యాబోధన
- ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు
- ఈ నెల 7 వరకూ అవకాశం



ప్రాజెక్టర్ ద్వారా విద్యార్థులకు బోధిస్తున్న దృశ్యం



హిందూపురం మండలం సీ.చెర్లోపల్లిలోని ఏపీ ఆదర్శ పాఠశాల

హిందూపురం టౌన్: కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధనకు ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఏపీ మోడల్ స్కూళ్లు, కళాశాలలు చిరునామాగా నిలుస్తున్నాయి. నిష్ణాతులైన అధ్యాపక బృందం ఆధ్వర్యంలో బాల, బాలికలకు ఆంగ్ల మీడియంలో విద్యాబోధన అందుబాటులో ఉంది. ఉన్నత విద్యా ప్రమాణాలు పాటిస్తూ, మంచి ఫలితాలను సాధిస్తున్నాయి. జిల్లాలోని 10 మోడల్ స్కూల్స్, కళాశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించారు. దరఖాస్తుల స్వీకరణ ఈనెల 7న ముగియనుంది.

ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన

ఇంటర్ మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయి. ఆధునిక సౌకర్యాలతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఎల్ఈడీ ప్రొజెక్టర్‌తో విద్యాబోధన, లైబ్రరీ ఇతర వసతులను కల్పించారు. ఫలితంగా 10వ తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధిస్తున్నారు. ఇంటర్ సిలబస్‌తో పాటు ఎంసెట్, ఐఐటీ, నీట్ వంటి పరీక్షలకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు.

నిరుపేదలకు వరం

ఏపీ మోడల్ స్కూళ్లు, కళాశాలలు నిరుపేదలకు వరంగా మారాయి. శ్రీ సత్య సాయి జిల్లాలో హిందూపురంతో పాటు అమడగూరు, అమరాపురం, అగళి, పుట్టపర్తి, నల్లచెరువు, ధర్మవరం, చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానిపల్లిలో ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి.

దరఖాస్తు.. ఎంపిక ఇలా..

- జిల్లాలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుకు అర్హులు.
- దరఖాస్తు చేసుకునే ఓసీ, బీసీ, ఈడబ్ల్యూస్ విద్యార్థులు దరఖాస్తు ఫీజుగా రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- & http://apms.ap.gov.in/apms/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- పదో తరగతి పరీక్షల్లో సాధించిన మార్కులు, రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లను కేటాయిస్తారు.

కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో బోధన



కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో నాణ్యమైన ఇంగ్లిష్ మీడియంతో ఇంటర్ విద్య అందుబాటులో ఉంది. 10వ తరగతి, ఇంటర్ మీడియట్‌లో మంచి ఫలితాలను సాధించాం. ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ కోసం విద్యాశాఖ ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. నిర్ణీత రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో జూన్ 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి.

– అశోక్ నాయక్, ప్రిన్సిపాల్, ఏపీ ఆదర్శ పాఠశాల, హిందూపురం



పంట రుణాలు రెన్యూవల్ చేసుకోండి

- ఏపీజీబీ మేనేజర్లు నాగరమణ, క్రిష్ణమూర్తి

రొళ్ల: రొళ్ల, రత్నగిరి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ శాఖల పరిధిలోని బీజీ హళ్లి, రొళ్ల, మల్లినమడుగు, ఎం.రాయాపురం, హొట్టేబెట్ట, హులికుంట, రత్నగిరి, గుడ్డగుర్కి, కాకి, దొడ్డేరి పంచాయతీ పరిధిలో పంట రుణాలు తీసుకున్న రైతులు రెన్యూవల్ చేసుకోవాలని ఆయా శాఖల మేనేజర్లు నాగరమణ, క్రిష్ణమూర్తి శనివారం తెలిపారు. రూ.లక్ష లోపు పంట రుణాలు పొందిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 4 శాతం, కేంద్రం ప్రభుత్వం 3 శాతం వడ్డీని చెల్లిస్తుందన్నారు. ఆపై రుణాలు పొందిన రైతులకు కేవలం రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే వడ్డీని చెల్లిస్తుందన్నారు. అయితే గత ఏడాది పంట రుణాలు రెన్యూవల్ చేసుకున్న తేదీ నాటికి ఒక రోజు ముందే ఈ ఏడాది రెన్యూవల్ చేసుకున్న రైతులకు మాత్రమే వడ్డీ శాతం తగ్గుతుందన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సకాలంలో పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని మేనేజర్లు కోరారు.

వైఎస్సార్ బీమా సర్వేపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహనాయుడు

లేపాక్షి: వైఎస్సార్ బీమా పథకం సర్వేపై ఎంపీడీఓ నరసింహనాయుడు శనివారం మండల వ్యాప్తంగా ఉన్న వేల్ఫేర్ కార్యదర్శులతో తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. వైఎస్సార్ బీమా పథకం ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

మడకశిరలో 5న జిల్లా స్థాయి స్పందన

మడకశిర: మడకశిరలో ఈనెల 5న జరిగే జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ బాలాంజినేయులు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఆరోజు ఉదయం 10 గంటలకు పట్టణ సమీపంలోని పెనుకొండ రోడ్డులో ఉన్న వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనసాగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించాలన్నారు. అర్జీకి ఆధార్ కార్డు నకలు జత చేయాలని, అర్జీలో ఫోన్ నంబర్ పొందుపరచాలన్నారు.

జగనన్నను మళ్లీ గెలిపిద్దాం



ప్రధాన రహదారిలో సాగుతున్న ఆటో ర్యాలీ

- హిందూపురంలో భారీ ఆటోర్యాలీ

హిందూపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో హిందూపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని గెలిపించి జగనన్నను మరోమారు ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెడదామని ఆటోయూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో వందలాది ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి ప్రారంభమైన ర్యాలీ పరిగిరోడ్డులోని వైఎస్సార్ విగ్రహం, అంబేడ్కర్ సర్కిల్ వరకు కొనసాగింది. ఆటో యూనియన్ నాయకులు మహమ్మద్ జబీవుల్లా, అల్లాబకాష్, సలీముల్లా, మధు, నాగరాజు మాట్లాడారు. 2024 ఎన్నికల్లో హిందూపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆటో కార్మికులతోపాటు అన్ని వర్గాల ప్రజల ఉపాధికి సహకారం అందించారన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఖలీల్, చాంద్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్

లేపాక్షి: రైతులు చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలని ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఆయన రైతులకు, ఆర్‌బీకే సిబ్బందికి అవగాహన సదస్సును నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ రాగి, కొర్ర, సజ్జ, జొన్న, అండుకొర్రల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయన్నారు. చిరుధాన్యాలపై ప్రజలు ఆసక్తి పెంచుకుంటున్నారని, ఈ నేపథ్యంలో వాటి సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. పండించిన చిరుధాన్యాలను ఆర్‌బీకేల్లో మద్దతు ధరతో కొంటామన్నారు. రాగి పంటను క్వింటాలు రూ. 3578తో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.

'కాఫీ విత్ మెన్'తో సమస్యల పరిష్కారం



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

చిలమత్తూరు: కాఫీ విత్ మెన్ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పీఎస్‌లో శనివారం ఆయన పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులతో సమావేశాన్ని నిర్వహించారు. వారం రోజులుగా మండల పరిధిలో అందిన ఫిర్యాదులు, సేవలు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. నేరాలను నియంత్రించి ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించడమే లక్ష్యంగా పనిచేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు.

షిరిడీసాయి విగ్రహ ప్రతిష్టాపన



షిరిడీ సాయిబాబా విగ్రహం

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారిపై దుద్దేబండ మలుపు వద్ద నిర్మించిన షిరిడీ సాయి బాబా ఆలయంలో నూతన పాలరాతి షిరిడీ సాయి బాబా విగ్రహ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. శనివారం తెల్లవారు జామున వేదపండితుల మంత్రోచ్చారణమధ్య విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేసినట్లు ఆలయ ధర్మకర్త గురప్ప తెలిపారు. కాగా ఆలయం పైభాగంలో అలంకరణ పనులు నిర్వహిస్తుండగా విద్యుత్ వైర్లు తగలడంతో హరిపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు.

ఘనంగా అలుకుందస్వామి విగ్రహ ప్రతిష్టాపన



పూజలు చేసిన దృశ్యం

పావగడ: పట్టణంలోని బళ్లారి రోడ్డులో నిర్మించిన అలుకుందస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఉప సర్పంచ్ మృతి



సుధాకర్ మృతదేహం

గోరంట్ల: మండల పరిధిలోని పులేరు గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ ఉప సర్పంచ్ సుధాకర్ (50) మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుధాకర్..శనివారం రాత్రి భోజనం అనంతరం పులేరు – బూదిలి రోడ్డుపై వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

రైలు ప్రమాద మృతులకు కొవ్వొత్తులతో నివాళి



కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటిస్తున్న దృశ్యం

హిందూపురం: ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ శనివారం రాత్రి లైఫ్‌వరల్డ్ చారిటబుల్ ట్రస్టు కన్వీనర్ ఉదయ్, మనోజ్ జులియట్ ఆధ్వర్యంలో క్రైస్తవులు పట్టణంలో సీఅండ్‌ఐజీ చర్చి వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రార్థనలు చేసి రెండు నిమిషాలపాటు మౌనం పాటించి మృతులకు నివాళులర్పించారు. సంఘ పెద్దలు అబ్రహం, శ్రీరాములు, శివ, అంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడాలి



మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

అమరాపురం: బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలని గుడిబండ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో సీడీపీఓ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసుకుని ప్రతి శనివారం సమావేశమై 18 సంవత్సరాల లోపు ఉన్న బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. పెళ్లి వద్దు, చదువు ముద్దు అనేలా బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. బాలికలు చదువుకుంటే కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతారనే విషయాన్ని వివరించాలన్నారు. బడిమానిన పిల్లలను గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి చదువు విలువపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సన్నమ్మ, కమలమ్మ, లీలావతి అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు ఉన్నారు.

బాధ్యతగా పనిచేయండి



పలగలపల్లి సచివాలయంలో విచారణ జరుపుతున్న సబ్ కలెక్టర్ కార్తీక్

చిలమత్తూరు: మండలంలోని పలగలపల్లి పంచాయతీలో ఇటీవల ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్ తొలగించిన నలుగురు వలంటీర్లకు సబ్ కలెక్టర్ కార్తీక్ నిర్ణయంతో ఉపశమనం లభించింది. సబ్‌కలెక్టర్ కార్తీక్ శనివారం పలగలపల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించి విచారణ జరిపారు. ప్రజలు, సచివాలయ సిబ్బందితో సమాచారాన్ని సేకరించారు. ప్రజలంతా వలంటీర్లకు మద్దతుగా నిలవడటంతో సబ్ కలెక్టర్ వారి ఉద్యోగాలపై భరోసా కల్పించారు. ఇకపై జాగ్రత్తగా విధులు నిర్వహించాలని, మరోసారి ఫిర్యాదులందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

పది మంది గైర్హాజరు

చిలమత్తూరు: మండల కేంద్రంలోని పొట్టిశ్రీరాములు జెడ్పీహెచ్ఎస్‌లో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా సాగుతున్నాయి. శనివారం జరిగిన హిందీ పరీక్షకు 18 మంది హాజరు కావాల్సి ఉండగా 8 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇన్‌చార్జి ఎంఈఓ నాగరాజు తెలిపారు.

సరుకుల పంపిణీలో పారదర్శకత

మడకశిరరూరల్: మండలంలోని ఎండీయూ ఆపరేటర్లు తూకాల్లో వ్యత్యాసం లేకుండా పారదర్శకంగా సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ బాలాంజనేయులు తెలిపారు. రెవెన్యూ అధికారులు శనివారం గ్రామాల్లో పర్యటించి సరుకుల పంపిణీని పర్యవేక్షించారని తెలిపారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం



వలంటీర్లను సన్మానిస్తున్న బలరామిరెడ్డి

హిందూపురం: వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా శనివారం 14వ వార్డు సచివాలయంలో అవార్డు గ్రహీత వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థకు వలంటీర్లు పునాదుల వంటివారన్నారు. ఇంటింటికీ వెళ్లి వారు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న గ్రామ యువకులు

హిందూపురం: చలివెందల పంచాయతీ సర్పంచ్ సౌభాగ్యమ్మ ప్రథమవర్ధంతి సందర్భంగా రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉపేంద్రరెడ్డి ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ రక్తసేకరణ వాహనంలో గ్రామంలోని యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో దిలీప్‌కుమార్, రాజేష్‌రెడ్డి, వీరా, వినోద్‌కుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వైఎస్సార్ బీమా రెన్యూవల్స్ వేగవంతం చేయాలి

రొళ్ల: వైఎస్సార్ బీమా రెన్యూవల్‌ను వేగవంతం చేయాలని ఎంపీడీఓ రామారావు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమై ఈ–సర్వీసెస్, వైఎస్సార్ బీమా రెన్యూవల్‌తో పాటు ఇతరాత్ర సంక్షేమ పథకాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల 7వ తేదీ లోపు వైఎస్సార్ బీమా రెన్యూవల్ పూర్తి చేయాలన్నారు.

ఉపాధి పనులను వినియోగించుకోండి

మడకశిరరూరల్: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులు, కుంటల్లో చేపట్టిన పూడిక తీత పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ శ్రీకాంత్‌గౌడు సూచించారు. బుళ్లసముద్రం చెక్‌డ్యామ్‌లో జరుగుతున్న పూడికతీత పనులను శనివారం ఆయన పరిశీలించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీ ఉపాధి పనులను ఉపయోగించుకోవాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

సోమందేపల్లి: మండలంలోని పత్తికుంటపల్లి గ్రామంలో శనివారం దాడులు నిర్వహించి పరిగి మండలం శీగుపల్లికు చెందిన రామాంజినేయులు అనే వ్యక్తినుంచి 80 టెట్రా పాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

మడకశిర ఎస్టీఓగా అనిల్‌కుమార్



మడకశిర: మడకశిర ఎస్టీఓ(సబ్ ట్రెజరీ అధికారి)గా అనిల్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల బిల్లుల విషయంలో సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం

హిందూపురం: బెంగళూరు రోడ్డులోని 17వ వార్డులో నెలకొన్న నీటి ఎద్దడి సమస్య పరిష్కారమైంది. ఇక్కడ కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. పైప్‌లైన్‌ను శనివారం వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్ మాజన్ పరిశీలించారు. నీటి సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు హబీబ్ పాల్గొన్నారు.

కంటి పరీక్షలు

లేపాక్షి: మండలంలోని బిసలమానేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నందు శనివారం సర్పంచ్ నాగేంద్రబాబు అధ్యక్షతన వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సుబ్బారావు 37 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 11 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు.

పరిసరాల సంరక్షణపై చిత్రలేఖనం పోటీలు

పావగడ: విశ్వ పరిసర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బ్రైట్ ఫ్యూచర్ కంప్యూటర్ శిక్షణా కేంద్రంలో విద్యార్థులకు శనివారం చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి సుమారు 150 మంది పాల్గొని పచ్చదనం పెంపుపై చిత్రాలు గీసి ఆకట్టుకున్నారు. బీఈఓ అశ్వర్థనారాయణ మాట్లాడుతూ వనాలతోనే వానలు కురుస్తాయని, చెట్లు విరివిగా పెంచి పరిసర రక్షణకు పాటు పడాలన్నారు. హాస్య కళాకారుడు సత్య లోకేశ్ పరిసరాల పరిరక్షణపై పాట పాడి ఆకట్టుకున్నారు.